సాక్షి నంద్యాల

ఆదివారం ♦ 8 ♦ అక్టోబర్ ♦ 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన కె.కాశీ విశ్వేశ్వర శర్మ శనివారం రూ.1,00,200 విరాళంగా అందజేశారు.



మహిళలు క్రీడల్లో రాణించాలి

మహిళలు క్రీడల్లో రాణించాలని ఆర్‌యూ వీసీ ఆనందరావు పిలుపునిచ్చారు. వర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. 8లో▸



పీఏసీఎస్‌ల్లో జనఔషధి కేంద్రాలు

జిల్లాలోని 8 ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్‌ల్లో) ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సహకార అధికారి ఎన్.రామాంజనేయులు తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు మొబైల్ రికవరీ మేళా

బొమ్మలసత్రం: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు రికవరీ చేసిన ఫోన్లను ఆదివారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో అప్పగించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 9121101107 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసిన వారు ఈ మేళాకు హాజరుకావాలని కోరారు. రికవరీ చేసిన ఫోన్ల వివరాల మేరకు బాధితులకు సమాచారం ఇచ్చామన్నారు. బాధితుల ఆధార్ కార్డు, మొబైల్‌కు సంబంధించిన ధ్రువపత్రాలతో ఉదయం 8 గంటలకు ఎస్పీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ఐసీసీ క్రికెట్ ప్రపంచకప్ 2023 నేపథ్యంలో జిల్లాలో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్ ముఠాలు అమాయకులను, యువకులను లక్ష్యంగా చేసుకుని ఊబిలోకి దించే ప్రమాదం ఉందన్నారు. బెట్టింగ్ రాయుళ్లను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో బెట్టింగ్ కేసుల్లో ఉన్న వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంచామన్నారు. అమాయకుల బలహీనతను అడ్డుపెట్టుకుని బెట్టింగ్‌కు పాల్పడేలా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నా, బెట్టింగ్‌లో పాల్గొనాలని ప్రోత్సహించినా 100 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

19వేల క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి శుక్రవారం నుంచి శనివారం వరకు దిగువ ప్రాంతాలకు 18,853 క్యూసెక్కుల నీరు విడుదలైంది. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 6.605 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 13,210 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 1,417 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1688, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 91.4060 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 854.80 అడుగులకు చేరుకుంది.

సాగునీటిని వృథా చేయొద్దు


తెలుగుగంగ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరమణ

రుద్రవరం: తెలుగుగంగ ఆయకట్టుదారులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ఎస్ఈ వెంకటరమణ సూచించారు. శనివారం ఆయన తెలుగుగంగ ప్రధాన కాల్వ, ఉప ప్రధాన కాల్వలకు తూముల ద్వారా ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగువ ఆయకట్టుకు నీరందేలా రైతులు సహకరించాలన్నారు. కాల్వకు గండ్లు కొట్టడం, అడ్డుకట్ట వేయడం వంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. తెలుగుగంగ నీటితో రుద్రవరం మండలంలోని అన్ని చెరువులను ఎప్పటికప్పుడు పూర్తిగా నింపుతామన్నారు. నవంబర్ నెలాఖరు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

3 జలాశయాలు.. అభయారణ్యాలు


ఎస్ఎస్‌టీఆర్‌కి వరం.. శ్రీశైల జలాశయం

220 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న శ్రీశైలం రిజర్వాయర్ రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి సొత్తుగా ఉన్నప్పటికీ అధిక భాగం కర్నూలు జిల్లాలోనే ఉంది. ఈ జలాశయంలో అపారమైన మత్స్య సంపదతో పాటు అతి పెద్దవైన తాబేళ్లు (టోలీలు) జీవిస్తున్నాయి. రెండు రకాల మొసళ్లు, నీటి కుక్కలు(ఆటర్‌లు) కూడా ఉన్నాయి. ఈ జలాశయం పరిధిలోని సంగమేశ్వరం ప్రాంతం పక్షి కేంద్రంగా మారింది. అరుదైన ఎర్ర కాళ్ల కొంగ (పెలికాన్‌లు), డ్యాబ్ చిక్ బాతులు, ఈగ్రెట్ కొంగలు, సుదూర ప్రాంతా నుంచి వచ్చే గుల్‌లు, పెయింటెడ్ స్టార్క్‌లు ఇక్కడ కనిపిస్తు ఉంటాయి. శ్రీశైలం జలాశయం యావత్తు నాగార్జున సాగర్ – శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యానికి మధ్యలోనే ఉండడం గమనార్హం. ఎస్ఎస్‌టీఆర్‌గా పిలువ బడే ఈ అభయారణ్యం దేశంలోని పులుల అభయారణ్యాలన్నింటిలోకి విస్తీర్ణంలో అతి పెద్దది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 3,568 చ.కిమీ విస్తీర్ణంలో విస్తరించింది. పెద్ద పులి అయినప్పటికీ చిరుతపులి, ఎలుగు బంటి వంటి 17 జాతుల మాంసాహార జంతువులు (కార్నివోర్స్) జీవిస్తున్నాయి. దుప్పి, కణితి, కృష్ణ జింక వంటి 8 రకాల గడ్డితినే జంతువులు (హెర్బీవోర్స్) ఉన్నాయి. మరో 200 జాతుల పక్షులు, నాగు పాము, కొండ చిలువ, రక్త పింజరి వంటి పాములతో కలిపి 54 రకాల సరీసృపాలు, 18 రకాల ఉభయచర జీవులు, 28 రకాల చేపలు, 354 జాతుల ఔషధీ జాతుల వృక్ష జాతులు, 63 రకాల పుష్పించని (ఆర్కిడ్స్) మొక్కలు ఎస్ఎస్‌టీఆర్‌లో మనుగడ సాగిస్తున్నాయి.



అపార జల సంపద.. విశాలమైన అటవీ ప్రాంతం ఉన్న ఏ జిల్లా అయినా జీవవైవిధ్యానికి స్వర్గధామమే అవుతుంది. ఓ వైపు ఎత్తైన పర్వతాలు, లోతైన లోయలు, పచ్చని చెట్లతో అలరారే విస్తారమైన నల్లమల అడవులు, మరో వైపు జీవనదిగా ప్రవహించే కృష్ణానది, నది ఆధారంగా అటవీ సమీపంలో నిర్మించిన రిజర్వాయర్లతో జీవ వైవిధ్యం విరాజిల్లుతోంది. మూడు అభయారణ్యాలు, మూడు జలాశయాలు వన్యప్రాణుల జీవనానికి అనుకూలంగా మారాయి. ఇంతటి ప్రత్యేకత నంద్యాల జిల్లా సొంతం చేసుకోవడం విశేషం. నల్లమలలోని నాగార్జున సాగర్ – శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యం, గుండ్ల బ్రహ్మేశ్వరం వన్యప్రాణి అభయారణ్యం, రోళ్లపాడు అభయారణ్యాల్లోని జంతుజాలం ఆవాసానికి సమీపంలోని శ్రీశైలం, వెలుగోడు, అలగనూరు రిజర్వాయర్లు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయి.

– ఆత్మకూరురూరల్

- జీవ వైవిధ్యానికి స్వర్గధామంగా నల్లమల
- అరుదైన జంతుజాలానికి ఆవాసం
- పెద్దపులి ప్రవర్ధమానానికి అనుకూల వాతావరణం
- నంద్యాల జిల్లాకే దక్కిన ప్రత్యేకత అనుకూల వాతావరణం

అభయారణ్యం	వైశాల్యం	రిజర్వాయర్	ముఖ్య వన్యప్రాణి
ఎస్ఎస్‌టీఆర్	3,568 చ.కిమీ	శ్రీశైలం	పెద్ద పులి
జీబీఎం	1,194 చ.కిమీ	వెలుగోడు	బుర్ర జింక, పెద్ద పులి
రోళ్లపాడు	6.14 చ.కిమీ	అలగనూరు	బట్టమేక పక్షి


బుర్ర జింక (మౌస్‌డీర్) హనీబాడ్జర్


సంగమేశ్వరం వద్ద పక్షులు

నల్లమల ఊటీకి ఊతం.. వీబీఆర్ జలదుర్గం


వెలుగోడు రిజర్వాయర్

ఎస్ఎస్‌టీఆర్‌కు దక్షిణ సరిహద్దుగా ఉన్న నల్లమల అటవీ ప్రాంతమే గుండ్లబ్రహ్మేశ్వరం వన్యప్రాణి అభయారణ్యం (జీబీఎం). ఈ ప్రాంతాన్ని ఎస్ఎస్‌టీఆర్‌కు ఎక్స్‌టెండెడ్ కోర్‌గా పిలుస్తుంటారు. దగ్గరదగ్గరగా వర్షారణ్య శీతోష్ణస్థితికి దగ్గరగా ఉండే జీబీఎం ప్రాంతంలోకి ఇటీవల పెద ఎత్తున పులుల విస్తరణ జరిగింది. దీంతో ఈ ప్రాంతం కీలకమైంది. పులి, ఎలుగు బంటి, చిరుత పులుల వంటి మాంసాహార జంతువులతో పాటు అరుదైన మౌస్‌డీర్ (కూర పంది, బుర్రజింక) కూడా ఇక్కడ కనిపిస్తుంది. ఈ అభయారణ్యానికి సుమారు 12 కి.మీ చుట్టు కొలత ఉన్న 16 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న వెలుగోడు బాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రవేశ ద్వారంగా ఉంటోంది. ఈ అభయారణ్యానికి వెలుగోడు రిజర్వాయర్ ఒక జలదుర్గంగా రక్షణ కల్పిస్తోంది. గుండ్ల బ్రహ్మేశ్వరం అభయారణ్యం ఆకురాల్చు అడవుల్లో భాగమైనప్పటికీ కొంత ప్రత్యేక శీతోష్ణ స్థితి కలిగి ఉంటుంది. ఎంత వేసవిలో కూడా జీబీఎంలోని పర్వత ప్రాంతాల్లో 24 డిగ్రీల ఉష్ణోగ్రతకు సమీపంలోనే ఉంటుంది. ఈ వాతావరణం కారణంగా పలురకాల ఫెర్న్‌లు (పుష్పించని మొక్కలు) ఇక్కడ కనపడతాయి. డెన్స్ ఫారెస్ట్ (దట్టమైన అడవులు)లో మాత్రమే కనిపించే బుర్ర జింక ఇక్కడ విస్తారంగా కనిపిస్తుంది. అందమైన జలపాతాలకు కూడా జీబీఎం పుట్టినిల్లుగా ఉంటోంది. అశ్వర్థామ ప్రతిష్ఠించినట్లు చెప్పబడే గుండ్ల బ్రహ్మేశ్వరాలయం కూడా ఈ అటవీ ప్రాంతంలోనే ఉంది.

రోళ్లపాడుకు జీవం.. అలగనూరు

ప్రపంచంలోనే విలుప్తమయ్యే అవకాశమున్న అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్న బట్టమేక పక్షి (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) సంరక్షణ కోసం 1988లో రోళ్లపాడు పక్షి అభయారణ్యం ఏర్పాటు చేశారు. 6.14 చ.కిమీ విస్తీర్ణంలో ఉన్న ఈ అభయారణ్యం మొత్తం ఒక పెద్ద గడ్డి మైదానం. ఈ అభయారణ్యానికి కూడా అలగనూరు రిజర్వాయర్ వాటర్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసింది. ఈ అభయారణ్యంలో ప్రధానంగా బట్టమేక పక్షిని సంరక్షిస్తున్నప్పటికీ కృష్ణ జింక, నక్క, తోడేలు, కుందేళ్లు కూడా జీవిస్తున్నాయి. భారత దేశంలో అంతరించి పోయిన ఆసియా చిరుత పులి కూడా ఒకప్పుడు ఇక్కడ ఉండేదంటారు. చీతాకు పరిగెత్తి తన ఆహార జంతువును పట్టుకునేలా విశాల మైన గడ్డి మైదానాలు, అందులో నిర్భయంగా గడ్డి మేస్తు ఆదమరచి ఉండే కృష్ణ జింకలు ఉన్నందున ఒకప్పుడు ఆసియా చీతా ఇక్కడ ఉండేదని తెలుస్తోంది. అయితే అపరిమితమైన వేట కారణంగా చీతలు అదృశ్యమైనాయన్నది చారిత్రక విషాదం. అలగనూరు జలాశయం ఏర్పాటైన తర్వాత ఈ ప్రాంతంలో వన్యప్రాణుల మనుగడకు భద్రత ఏర్పడింది. నీటి వనరులు అందుబాటులోకి రావడంతో అభయారణ్యంలో జీవవైవిధ్యానికి వాతావరణం మరింత అనుకూలంగా మారింది.


బట్ట మేక పక్షి



అలగనూరు రిజర్వాయర్ (ఫైల్)

జిల్లాకు పుష్కలంగా ఎరువులు


ఎరువుల సరఫరాపై ఆరా తీస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు

నంద్యాల(సెంట్రల్): రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు అన్నారు. శనివారం నంద్యాలకు చేరుకున్న పీపీఎల్ కంపెనీకి చెందిన ఎరువుల వ్యాగన్‌ను ఆయన తనిఖీ చేశారు. కంపెనీ ముందస్తు ప్రణాళికలో పొందుపర్చిన డీలర్లకు ఎరువుల సరఫరా వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం వచ్చిన వ్యాగన్‌లో 900 మెట్రిక్ టన్నుల యూరియా, 905 మెట్రిక్ టన్నుల డీఏపీ, 710 టన్నుల 20:20:0:13 ఉందన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు 50 శాతం యూరియా మార్క్‌ఫెడ్ ద్వారా రైతు భరోసా కేంద్రాలకు, మిగతాది ప్రైవేట్ డీలర్లకు కేటాయించామని పేర్కొన్నారు. ఈ నెల 8న క్రిబ్‌కో కంపెనీకి చెందిన 3 వేల టన్నుల ఎరువుల వ్యాగన్ ర్యాక్ నంద్యాల పాయింట్‌కు వస్తుందన్నారు. నానో యూరియాపై జిల్లా వ్యాప్తంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గోడౌన్‌లో నిల్వ ఉంచుకునే ఎరువుల్ని హోల్‌సేల్ దుకాణాల వారీగా వేరుగా నిల్వ ఉంచాలని తెలిపారు. ఆయన వెంట నంద్యాల మండల వ్యవసాయ శాఖాధికారి ప్రసాదరావు, పీపీఎల్ కంపెనీ సిబ్బంది ఉన్నారు.

బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ల పరిశీలన


బ్యాలెట్ యూనిట్లను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: టెక్కె మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌనులోని బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల పనితీరుపై జరుగుతున్న యాక్సప్టెన్సీ టెస్ట్ విధానాన్ని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 12లోగా బెల్ కంపెనీ ఇంజినీర్ల ఆధ్వర్యంలో యాక్సప్టెన్సీ టెస్ట్ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాకు మొత్తం 5000 బ్యాలెట్ యూనిట్లు (బీయూలు), 3000 కంట్రోల్ యూనిట్లు, 4900 వీవీ ప్యాట్స్ రావడం జరిగిందన్నారు. నోడల్ అధికారి ఆధ్వర్యంలో వీటన్నింటిని బెల్ ఇంజినీర్లతో పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియకు ఓవరాల్ ఇన్‌చార్జ్ అధికారులుగా డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి వ్యవహరిస్తారన్నారు.

జైపూర్ రైలు కర్నూలు వరకు పొడిగింపు

కర్నూలు(రాజ్‌విహార్): జైపూర్ (రాజస్థాన్) నుంచి కాచిగూడ (తెలంగాణ) వరకు రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలును కర్నూలు వరకు పొడిగించారు. ఈ నెల 9న కాచిగూడలో ఉదయం 9 గంటలకు పొడిగింపు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రైలును కర్నూలు వరకు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జైపూరు నుంచి 19713 నంబరు రైలు ప్రతి సోమవారం ఉదయం 6.30 గంటలకు కాచిగూడకు వచ్చి..కర్నూలుకు 11:20 గంటలకు చేరుకుంటుంది. తిరిగి కర్నూలు నుంచి 19714 నంబరు రైలు అదే రోజు సాయంత్రం 4:15 గంటలకు బయలుదేరి కాచిగూడకు రాత్రి 9గంటలకు చేరుకుంటుంది.

వేరుశనగ క్వింటా రూ.9,009

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వేరుశనగ క్వింటా రూ.9009 ధర పలికింది. కర్నూలు మార్కెట్ చరిత్రలో వేరుశనగకు లభించిన అత్యధిక ధర ఇదే కావడం గమనార్హం. మార్కెట్‌కు 41 మంది రైతులు 264 క్వింటాళ్ల దిగుబడిని తెచ్చారు. కనిష్ట ధర రూ.4,259, గరిష్ట ధర రూ.9,009 లభించాయి. మోడల్ ధర రూ.6,759 నమోదైంది.

12న చివరి పారా మెడికల్ కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డిప్లొమా పారామెడికల్ కోర్సులకు చిట్టచివరి కౌన్సెలింగ్ ఈనెల 12న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, కన్వీనర్ డాక్టర్ పి.హరిచరణ్ తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు విడతల కౌన్సెలింగ్ నిర్వహించగా, ఇంకా 8 సీట్లు మిగిలాయన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారంతా కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ విద్యుత్ ఏఈపై వేటు

- కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ మార్చడంలో నిర్లక్ష్యానికి ఫలితం
- రైతు ఏడుస్తూ ఫోన్ చేయడంతో నేరుగా వెళ్లి తనిఖీ చేసిన ఎస్ఈ ఉమాపతి
- సెంటు పొలం ఎండినా చర్యలు తప్పవని హెచ్చరిక


రైతు పొలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ ఉమాపతి


ట్రాన్స్‌ఫార్మర్‌ను మారుస్తున్న విద్యుత్ సిబ్బంది

ఎమ్మిగనూరు/కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎమ్మిగనూరు రూరల్ ఏఈ సునీల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కాలిపోయిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను సకాలంలో మార్చడంలో నిర్లక్ష్యం వహించినందుకు చర్యలు తీసుకుంటూ ఉన్నతాధికారులు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండలం కె. తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతు చిన్న వీరేష్ పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ పది రోజు క్రితం కాలిపోయింది. ఈ విషయాన్ని స్థానిక లైన్‌మ్యాన్ ద్వారా ఏఈ సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 48గంటల్లోపు కొత్తది అమార్చాలి. అయితే పది రోజులైనా మార్చలేదు. పైగా ఏఈ, లైన్‌మ్యాన్ ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేయడంతో రైతు వీరేష్ పొలంలోని మిరప పంట ఎండిపోయింది. దీంతో ఆయన శనివారం ఉదయం కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈకి ఫోన్ చేసి విషయం చెప్పడంతో పాటు పంట ఎండిపోయిన తనకు చావే దిక్కు అంటూ బోరున విలపించాడు. దీనిపై ఎస్ఈ వెంటనే సంబంధిత ఏఈకి కాన్ఫరెన్స్ కాల్ చేసి ప్రశ్నించగా అది లైన్‌మ్యాన్ తప్పు.. తనకేమి పట్టనట్లు సమాధానం ఇచ్చారు. పంట ఎండిపోయిందని విలపించిన రైతు సమస్యను వాస్తవంగా తెలుసుకునేందుకు ఎస్ఈ ఉమాపతి నేరుగా ఆ గ్రామానికి వెళ్లారు. పంట తనిఖీ చేయడంతో పాటు ఎండిన పంట ఫొటోలు, రైతు వాగ్మూలాన్ని తీసుకున్నారు. వెంటనే ఎమ్మిగనూరు ఏఈడీని, ఆదోని ఈఈ సుధాకర్ కుమార్‌ను పిలిపించి సమస్య వివరించారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తెప్పించి అమర్చారు. సాయంత్రం ఏఈకి చార్జ్ మెమో ఇచ్చి, ఈ విషయాన్ని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు దృష్టికి తీసుకెళ్లారు. సీఎండీ ఆదేశాల మేరకు రాత్రి ఏఈ సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్ఈ ఉమాపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ విద్యుత్ సరఫరా, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత విద్యుత్ సిబ్బందిపై ఉందని పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, సామగ్రి కొరత లేదని, ఎక్కడైనా నిర్లక్ష్యం కారణంగా సెంటు స్థలంలో పంట ఎండినా చర్యలు కఠినంగానే ఉంటాయని హెచ్చరించారు. రైతులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని, ఇబ్బందులు ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

డీఆర్‌డీఏ పీడీగా సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎస్‌.సలీమ్‌బాషా నియమితులయ్యారు. శనివారం జిల్లా కలెక్టర్‌ జి.సృజనకు ఆయన జాయినింగ్‌ రిపోర్టు ఇచ్చారు. ఈయన సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. డీఆర్‌డీఏ పీడీ పోస్టు మూడు నెలలకుపైగా ఖాళీగా ఉంది. మెప్మా పీడీ నాగశివలీల పూర్తి అదనపు బాధ్యతలతో విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా రెగ్యులర్‌ పీడీగా సలీమ్‌బాషా నియమితులయ్యారు.

శ్రీశైలానికి మరోపేరు మందర పర్వతం


సామవేదం షణ్ముఖశర్మ

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైల మహాక్షేత్రానికి మరో పేరు మందర పర్వతమని సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హిందూ ధర్మప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమం ఏడవ రోజు శనివారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పురాణాల్లో శివుడు సర్వదేవతాగణాలతో మందర పర్వతములో ఉన్నట్లుగా పేర్కొనబడింది, ఆ మందర పర్వతమే శ్రీశైలమన్నారు. ఈ శ్రీశైలాన్ని కేంద్రంగా చేసుకుని పరమేశ్వరుడు విశ్వనిర్మాణ కార్యక్రమాలన్ని నిర్వహిస్తుండడం వలన శ్రీశైలక్షేత్రం విశ్వ కార్యాలకు కేంద్ర స్థానం అనే ప్రసిద్ధి పొందిందన్నారు. ఈ భవ్యక్షేత్రానికి కొంచ పర్వతం అనే పేరు ఉన్నట్లుగా శివపురాణం పేర్కొందన్నారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


రంగమ్మ(ఫైల్‌)

ఎమ్మిగనూరురూరల్‌: అత్తింటి వేధింపులు తాళలేక రంగమ్మ (30) అనే వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దైవందిన్నె గ్రామానికి చెందిన గిడ్డయ్య, లక్ష్మీల కుమారుడు యంకప్పకు గార్లదిన్నె గ్రామానికి చెందిన నరసమ్మ, భీరప్పల కుమార్తె రంగమ్మతో 11 సంవత్సరాల కిత్రం వివాహం జరిగింది. వీరికి మహేష్‌, వైష్ణవి, దివ్య, ప్రియలు సంతానం. కొన్ని సంవత్సరాలు సంసారం సాఫీగా సాగింది. రంగమ్మను అత్తమామల నిత్యం వేధింపులు గురిచేసేవారు. ఇదే విషయం తన తల్లిదండ్రులకు చెబితే.. నలుగురు పిల్లలు ఉన్నారని, సర్దుకుపోవాలి చెప్పేవారు. శుక్రవారం పొలంలో సజ్జ కంకి కోసేందుకు రంగమ్మ అన్నలు వచ్చారు. పొలంలో పనిచేసి సంచులను ఇంటి దగ్గర వేసి వెళ్లారు. దీంతో రంగమ్మను అత్తమామ లక్ష్మీ, గిడ్డయ్యలు అసభ్య పదజాలతో తిట్టారు. మనస్తాపానికి గురైన రంగమ్మ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. తమ కుమార్తె అత్తమామల వేధింపులు కారణంగానే మృతి చెందిందని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్‌ పోలీసులు తెలిపారు.

మహిళలు క్రీడల్లో రాణించాలి

- ఆర్‌యూ వైస్‌చాన్సలర్‌ ఆనందరావు
- ప్రారంభమైన అంతర్‌ కళాశాలల మహిళా క్రీడా పోటీలు


హ్యాండ్‌బాల్‌లో తలపడుతున్న జట్లు


గౌరవ వందనం చేస్తున్న క్రీడాకారిణులు

కర్నూలు (టౌన్‌): మహిళలు క్రీడల్లో రాణించాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్‌ చాన్సలర్‌ ఎ. ఆనందరావు పిలుపునిచ్చారు. సెయింట్‌ జోసఫ్‌ కళాశాల మైదానంలో అంతర్‌ కళాశాలల మహిళా క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. కరణం మల్లేశ్వరి, పీవీ సింధు, నిఖత్‌ జరీన్‌, సైనా నెహ్వాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఏసియన్‌ క్రీడల్లోను మహిళలు సత్తా చాటుతున్నారు. సెయింట్‌ జోసఫ్‌ కళాశాల డీన్‌ వై.శౌరీలు రెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సెట్కూర్‌ సీఈఓ. రమణ, కేడీసీడీ ఆర్‌ కమిషన్‌ మహిళ సభ్యురాలు నజీమా కౌసర్‌, విశ్వవిద్యాలయ క్రీడల కార్యదర్శి డాక్టర్‌ శివ కిషోర్‌, సెయింట్‌ జోసఫ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె. శాంత, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొదటి రోజు విజేతలు..

మొదటి రోజు హ్యాండ్‌బాల్‌, వాలీబాల్‌ పోటీల్లో జట్లు పోటీపడ్డాయి. హ్యాండ్‌బాల్‌ పోటీల్లో జెఎంజె సెయింట్‌జోసఫ్‌ మహిళా కళాశాలపై 2-0 స్కోర్‌తో సెయింట్‌ జోసఫ్‌ కళాశాల జట్టు , ఎస్‌ఎంఎల్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు (ఎమ్మిగనూరు)పై ఆదోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్సు కళాశాల జట్టు 4-0 తేడాతో గెలుపొందాయి. వాలీబాల్‌ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ కళాశాల జట్టుపై సెయింట్‌ జోసఫ్‌ ఉమెన్‌ కళాశాల జట్టు 25-16, 25-12 స్కోర్‌తో, సెయింట్‌ కళాశాల జట్టు (కర్నూలు)పై బసిరెడ్డి మెమోరియల్‌ డిగ్రీ కళాశాల జట్టు (నందికొట్కూర్‌) 25-12, 25-14 స్కోర్‌తో గెలుపొందాయి.

క్లుప్తంగా

పీఏసీఎస్‌ల్లో 8 జన ఔషధి కేంద్రాలు

కర్నూలు(అగ్రికల్చర్‌): జిల్లాలోని 8 ప్రాథమిక సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్‌ల్లో) ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సహకార అధికారి ఎస్‌.రామాంజనేయులు తెలిపారు. శనివారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పీఏసీఎస్‌ల సీఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. సీ.బెళగల్‌, హొళగుంద, ఓర్వకల్లు, కౌతాళం, పెద్దకడుబూరు, మద్దికెర, మధిర పీఏసీఎస్‌లతో పాటు జిల్లా సహకార మార్కెటింగ్‌ సొసైటీల్లోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిల్లో నాణ్యమైన మందులు తక్కువ ధరకే లభిస్తాయన్నారు. మల్టీపర్పస్‌ గోదాముల నిర్వహణ బాధ్యత పీఏసీఎస్‌లదేనన్నారు. సొసైటీల్లో కామన్‌ అకౌంటింగ్‌ సిస్టమ్‌ అమలు వల్ల లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదోని డివిజినల్‌ సహకార అధికారి ఉమాదేవి, సహకార ఆడిట్‌ అధికారి శిరీష, కర్నూలు సబ్‌ డివిజన్‌ అధికారి నాగరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


తెలుగు రాముడు (ఫైల్‌)

గోనెగండ్ల: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రాముడు(32) అనే వ్యక్తి మృతి చెందాడు. రాళ్లదొడ్డి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన తెలుగు రాముడు, భార్య ఈరమ్మలకు ఇద్దరు కుమారులు, కుతూరు ఉన్నారు. రాముడు గ్రామంలో రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నాడు. గోనెగండ్లలో జరిగే చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి వేడుకలు చూసేందుకు రాళ్లదొడ్డి గ్రామం నుంచి శనివారం సాయంత్రం వచ్చాడు. రాత్రి దశమి వేడుకలను చూసి తన గ్రామానికి కాలినడకన వెళ్తుండగా గోనెగండ్ల విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ దగ్గర కోడుమూరు నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న ఆర్‌టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సు డ్రైవర్‌ అక్కడ నుంచి పారిపోగా.. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ తిమ్మారెడ్డి, పోలీస్‌ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాముడి మృతదేహాన్ని బంధువుల సాయంతో పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

నంద్యాల(న్యూటౌన్‌): పట్టణంలోని ఖాదరబాద్‌ నర్సింగ్‌రావు పురపాలకక ఉన్నత పాఠశాలలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్‌ గేమ్స్‌ క్రీడాకారుల ఎంపిక పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌, వైస్‌ చైర్మన్‌, జిల్లా ప్రాధికారత సంస్థ ముఖ్య శిక్షకులు రాజు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి రవికుమార్‌, శివకుమార్‌, రాష్ట్ర కో ఆర్డినేటర్‌ విశ్వనాథ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, పర్యాటక, క్రీడల, యువజన మంత్రి రోజ క్రీడాకారుల ప్రోత్సాహానికి చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.40 కోట్ల వ్యయంతో త్వరలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించనుందన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి 1,200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి శివకుమార్‌ను పాఠశాల హెచ్‌ఎం అసదుల్లా హుసేన్‌, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌, నాగరాజు, పుల్లన్న, నాగేంద్ర పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకంలో రాణిద్దాం

రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలు

- నేషనల్‌ లైవ్‌స్టాక్‌ మిషన్‌ ద్వారా 50 శాతం సబ్సిడీ
- జాయింట్‌ కలెక్టర్‌ నారాపురెడ్డి మౌర్య వెల్లడి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అగ్రికల్చర్‌): గొర్రెలు, మేకలతో పాటు కోళ్లు, పందుల పెంపకాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని.. ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ నారపురెడ్డి మౌర్య సూచించారు. నేషనల్‌ లైవ్‌స్టాక్‌ మిషన్‌ రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణ సదుపాయం కల్పిస్తుందని, ఇందులో సబ్సిడీ 50 శాతం ఉంటుందన్నారు. శనివారం కర్నూలు శివారులోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో నేషనల్‌ లైవ్‌ స్టాక్‌ మిషన్‌ ఆధ్వర్యంలో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్‌ కలెక్టర్‌ మౌర్య మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం శాస్త్రీయ పద్ధతులతో చేపడితే లాభసాటిగా ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్‌ డైరెక్టర్‌ రామచంద్రయ్య మాట్లాడుతూ www.nlm.udyamimitra.on వెబ్‌సైట్‌లో దరఖాస్తులు, డాక్యుమెంట్లు అప్‌లోడ్‌ చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు, డీఏఏబీ చైర్మన్‌ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సన్న జీవాల పెంపకానికి ప్రోత్సాహకం లభిస్తుండటం శుభ పరిణామం అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకాన్ని పరిశ్రమగా ఎన్‌ఎల్‌ఎం గుర్తించడం హర్షణీయమన్నారు. సమావేశంలో జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్‌ చైర్మన్‌ నాగేశ్వరరావు యాదవ్‌, ఎల్‌డీఎం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఏపీపీఎస్‌సీ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్‌): ఏపీపీఎస్‌సీ పరీక్షలు ఈ నెల 3 ప్రారంభమై 6వ తేదీ వరకు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కో ఆర్డినేటర్‌, డీఆర్వో కె.మధుసూధన్‌రావు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. ఐయాన్‌, కేవీసుబ్బారెడ్డి ఇంజనీరింగ్‌ కళాశాలలో ఆన్‌లైన్‌ ద్వారా పరీక్షలు నిర్వహించామన్నారు. అసిస్టెంట్‌ మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌, సివిల్‌ అసిస్టెంట్‌ సర్జన్‌, నాన్‌ గెజిటెడ్‌ గ్రూపు-4 పోస్టులకు ఎంపిక కోసం పరీక్షలు జరిగినట్లు చెప్పారు. మొత్తం 2,309 మంది విద్యార్థులకుగాను 743 మంది హాజరైనట్లు తెలిపారు.



మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- సెర్ప్‌ సీఈఓ ఇంతియాజ్‌


మాట్లాడుతున్న సెర్ప్‌ సీఈఓ ఇంతియాజ్‌

కర్నూలు(అగ్రికల్చర్‌): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి అని సెర్ప్‌ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఇంతియాజ్‌ అన్నారు. శనివారం కర్నూలు శివారులోని డీఆర్‌డీఏ శిక్షణా కేంద్రంలో జిల్లా సమాఖ్య కార్యవర్గ సమావేశం అధ్యక్షురాలు సీతాబాయి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సెర్ప్‌ సీఇవో ఇంతియాజ్‌ మాట్లాడుతూ... జిల్లా, మండల మహిళా సమాఖ్యలు ఆర్థికంగా బలోపేతం కావడానికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎస్‌ఎంఈ వంటి పథకాలను వినియోగించుకోవాలని కోరారు. రుణాలు పొందడమే కాదు.. వాటిని సద్వినియోగం చేసుకొని.. ఆర్థికంగా ప్రగతి సాధించాలన్నారు. ఉన్నతి, సీఐఎఫ్‌, స్త్రీనిధి, హెచ్‌డీ వంటి నిధులను జీవనోపాధులను మెరుగుపరుచుకోవడానికి వినియోగించుకోవాలని కోరారు. ప్రతి మహిళలో జీవనోపాధులను మెరుగుపరుచుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. జిల్లా సమాఖ్య భవనం నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో పాటు నిధులు కూడా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. జిల్లా, మండల సమాఖ్యల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నాగశివలీల వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు పీడీ శ్రీధర్‌రావు, జిల్లా సమాఖ్య కార్యదర్శి మాధవి, డీపీఎంలు రహిమాన్‌, నరసమ్మ, అయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో పాలిటెక్నిక్‌ కళాశాల

- ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన ఆర్‌జేడీ


పత్తికొండలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ నిర్మల్‌కుమార్‌, అధికారులు

పత్తికొండ రూరల్‌: పత్తికొండలో పాలిటెక్నిక్‌ కళాశాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. కొంతకాలంగా ఈ ప్రాంతంలో పాలిటెక్నిక్‌ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ ప్రాంత విద్యార్థుల ఆకాంక్షను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఆదేశాల ప్రకారంగా పాలిటెక్నిక్‌ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) నిర్మల్‌కుమార్‌, అనంతపురం, కర్నూలు పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌లు జేసీరెడ్డి, ప్రసాద్‌, ఆర్‌జెడి అసిస్టెంట్‌ డైరెక్టర్‌ వెంకటసుబ్బయ్య .. పత్తికొండ-గుత్తిరోడ్డు, హోసూరు రోడ్డు, కర్నూలు రోడ్డులోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. పత్తికొండ-గుత్తిరోడ్డులోని పాలిమేర ప్రాంతంలోని మిట్టబండ అనుకూలమైన స్థలంగా వారు పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య, వృత్తి విద్య ఆవశ్యకత, విద్యార్థుల నైపుణ్యం, ప్రాంతంలోని వ్యాపారాలు, రోడ్డు సౌకర్యం తదితర వివరాలను సేకరించారు. కళాశాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి నివేదికను పాలిటెక్నిక్‌ కమిషనర్‌, కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. వీరి వెంట ఎంపీపీ నారాయణదాస్‌, ఎంపీటీసీ సభ్యుడు నీలకంఠ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బనగాని శ్రీనివాసులు ఉన్నారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
OFFICE OF THE DISTRICT MEDICAL AND HEALTH OFFICER, KURNOOL.

(NOTIFICATION NO. 03/MO-RTO/NDL/2023, dt.07.10.2023)

RECRUITMENT TO ONE MEDICAL OFFICER POST THROUGH WALK-IN-INTERVIEW TO WORK AT REGIONAL TRANSPORT OFFICE, NANDYAL ON CONTRACT BASIS

Applications are invited from the eligible candidates for recruitment to one vacant post of Medical Officer through "WALK-IN-INTERVIEW" on Open Competition basis, to work at REGIONAL TRANSPORT OFFICE, NANDYAL, on contract basis under NHM initially for a period of one year.

Application form and other details (PROSPECTUS) are uploaded to the Kurnool District website-https: //kurnool.ap.gov.in and Nandyal District Website-https://nandyal.ap.gov.in.

Interested and Eligible Candidates are directed to download the APPLICATION FORM from the above said web-site and to attend for the WALK-IN-INTERVIEW with the filled in Application Form, along with their original Certificates/ documents, in the Office of the District Medical and Health Officer, Kurnool on 12.10.2023 between 10.30 AM to 5.00 PM.

Sd/- Dr. B.Ramagiddaiah, Dist. Medical & Health Officer, KURNOOL.	Sd/- Dr. G. Srijana, IAS District Collector, KURNOOL.